తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## సమాజ నిర్మాణంలో
# టీచర్ల పాత్ర కీలకం

### ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్



గురుపూజోత్సంను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయ పని వృత్తి కాదని, సమాజం రూపు రేఖలు మార్చే శక్తి అని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచెర్ల శ్రీకాంత్‌లు హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేశ నిర్మాణంలో టీచర్లు చేస్తున్న కృషిని గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించడానికి ప్రభుత్వం ప్రతి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులకు దిశా నిర్ధేశం చేసిందన్నారు. జిల్లాలో 10 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, ఈ ఏడాది 74 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సత్కరిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాఠశాల విద్యను అభ్యసించారని, ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసించినా, నేడు తాము వున్న స్థాయికి చేరుకోవడానికి ఉపాధ్యాయులే ప్రధాన కారణమన్నారు. 20, 30 సంవత్సరాల క్రితం తమకు విద్యాబోధనతో పాటు మంచి వ్యక్తిత్వం, విలువలు నేర్పిన ఉపాధ్యాయులను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నిజాయితీగా వుండాలని, సమాజానికి సేవ చేయాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, క్రమశిక్షణతో జీవించాలని బోధించడంతో పాటు వారి వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఉపాధ్యాయుల మంచి బోధన, మార్గదర్శకత్వం వల్ల నేడు మనమందరం ఈ స్థాయిలో వున్నామని, జీవితంలో ఉపాధ్యాయులను ఎప్పటికీ మరచిపోకూడదని సూచించారు. అలాగే ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఆదర్శంగా, రోల్ మోడల్‌గా నిలవాలని, తమకు బోధించే టీచర్లు ఎంతో మంచి వారని, ప్రతిభావంతులని, నిజాయితీపరులని, క్రమశిక్షణ కల్గిన వారని, తమపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ మంచి విషయాలను బోధిస్తున్నారని విద్యార్థులు ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులకు చెప్పే స్థాయిలో ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధన వుండాలన్నారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, తల్లిదండ్రుల తరువాత సమాజంలో గురువులకు అత్యున్నత స్థానం వుందని, నేటి స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరి జీవితంలో ఒక గురువు పాత్ర తప్పనిసరిగా వుంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లల్లో విలువలు, క్రమశిక్షణ తగ్గుతున్న పరిస్థితులపై ప్రతి ఒక్కరు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితంలో అవసరమైన మంచి ప్రవర్తన, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, సర్వశిక్షాభియాన్ పిడి వెంకటరమణ, జడ్పీ సిఇఓ రవిప్రకాష్‌నాయుడు, డివైఇఓ ఇందిర, ఎపి ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉట్లోత్సవంలో మలయప్ప

తిరుమల, సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:



శనివారం సాయంత్రం ఉట్లోత్సవం ఉత్సాహంగా జరిగింది. గోకులాష్టమి ఆస్థానం మరుసటి రోజు ఉట్లోత్సవాన్ని మలయప్పస్వామి, కృష్ణస్వామి సమక్షంలో నిర్వహించడం ఆనవాయితీ. బంగారు తిరుచ్చిపై మలయప్ప, మరో తిరుచ్చిపై కృష్ణస్వామి తిరువీధులలో ఊరేగుతూ పలు ప్రాంతాల్లో ఉట్లోత్సవాన్ని తిలకించారు. ఈ ఉట్లోత్సవంలో స్థానికులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ ఇన్ ఛార్జ్ డిప్యూటీ ఈఓ భయ్యాల భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఎఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ... జిల్లాలో 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం






తిరుపతి విద్య సెప్టెంబర్ 5 ప్రభాత వార్త

ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. విద్యను కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం చేయకుండా విద్యార్థుల్లో మానవీయ విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేలా బోధన సాగాలని సూచించారు. తిరుపతిలోని కచ్చపి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త భరత్‌కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన 65 మంది ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలతో పాఠశాలల్లో బోధనా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టి, ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా మార్పులు చేస్తున్నామని, బహుళ తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించే విధానానికి క్రమంగా ముగింపు పలుకుతున్నామని చెప్పారు. ఈ మార్పుల ఫలితాలు నాలుగైదేళ్లలో స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు వారి కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఆర్థిక సహాయం నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో 2.58 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందగా, వారిలో 1.72 లక్షల మందికి పైగా ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు చెందినవారేనని వివరించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలు అందించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు, సంగీతం, నృత్యం, పఠనం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారిని ప్రోత్సహించాలని అన్నారు. చిన్న వయసులోనే ఐఐటీ, సివిల్ సర్వీసుల వంటి పోటీ పరీక్షల పేరుతో విద్యార్థులపై అధిక ఒత్తిడి తీసుకురాకుండా, వారి ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి తగిన మార్గదర్శనం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాలని, విద్యార్థులు ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఎన్. లోకేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, బాధ్యత, తపస్సు, సామాజిక సేవతో కూడుకున్నదని అన్నారు. గత 100 రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 36 మండలాల్లో 36 రోజుల పాటు బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, ఇంటింటి ప్రచారం ద్వారా సుమారు 2,500 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు వివరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఏపీ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మెడికల్ కౌన్సిల్ చైర్మన్ హరివరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గురువారెడ్డి, ఏడీ రమణారావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ సుధ, డివైఈవోలు ఇందిరాదేవి, మహేశ్వరరావు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాకాలలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలి

### - పేద కిడ్నీ రోగులకు అందుబాటులోకి వైద్య సేవలు




పాకాల, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త

పాకాల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, కిడ్నీ రోగుల బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. డయాలసిస్ సేవల కోసం పాకాల మండలం, పరిసర గ్రామాలకు చెందిన కిడ్నీ రోగులు వారానికి రెండు, మూడు సార్లు తిరుపతి లేదా చిత్తూరుకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి రోగితో పాటు ఒక బంధువు వెళ్లాల్సి రావడంతో ప్రయాణ ఖర్చులు, ఇతర వ్యయాలతో పాటు ఒక పూట కూలి నష్టం కూడా కుటుంబాలపై భారం పడుతోందని తెలిపారు. డయాలసిస్ అనంతరం నీరసంగా ఉన్న రోగులను సుదూర ప్రాంతాల నుంచి తిరిగి తీసుకురావడం కూడా ఇబ్బందికరంగా మారుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మధుమేహం, అధిక రక్తపోటు తదితర కారణాలతో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాకాల ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం ఐదు డయాలసిస్ యంత్రాలతో యూనిట్ ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో విద్యుత్, నీటి వసతి, ల్యాబ్, వైద్యుల పర్యవేక్షణ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నందున డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం ద్వారా ఉచిత డయాలసిస్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్న నేపథ్యంలో పాకాలను కూడా ఈ కార్యక్రమంలో చేర్చాలని కోరుతున్నారు. డయాలసిస్ కేంద్రాల మధ్య దూరాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా పాకాల ప్రభుత్వ ఆసుపత్రికి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డయాలసిస్ ఉచితమైనప్పటికీ అక్కడికి వెళ్లేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులు, శ్రమ మాకు భారంగా మారుతున్నాయి. పాకాలలోనే డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తే మా వంటి పేద కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుంది అని రోగుల బంధువులు పేర్కొన్నారు. డయాలసిస్ అనేది దీర్ఘకాలికంగా కొనసాగించాల్సిన చికిత్స కావడంతో రోగులు సుదూర ప్రాంతాలకు తరచూ ప్రయాణించాల్సిన పరిస్థితి లేకుండా పాకాల వంటి గ్రామీణ ప్రాంతంలోనే సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేసి చర్యలు ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రధాన డిమాండ్లు: పాకాలలో కనీసం ఐదు యంత్రాలతో డయాలసిస్ యూనిట్‌ను తక్షణమే మంజూరు చేయాలి. శాశ్వత డయాలసిస్ టెక్నీషియన్‌ను నియమించాలి. నెఫ్రాలజిస్ట్ పర్యవేక్షణలో వైద్య సేవలు అందించాలి. ఆరోగ్యశ్రీ/ఎన్‌టీఆర్ వైద్య సేవల కింద ఉచిత డయాలసిస్ సౌకర్యం కల్పించాలి. పాకాలను కొత్తగా ఏర్పాటు చేయనున్న డయాలసిస్ కేంద్రాల జాబితాలో చేర్చాలి.

## అభిషేకం టిక్కెట్లు కట్టడికి నిర్ణయం

### దళారుల ఆగడాలకు చెక్



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త

రాష్ట్రంలోని దేవాలయాల్లో పరిమితంగా నిర్వహిస్తున్న అభిషేకం టిక్కెట్లు అందరికి అందేటట్లు దేవాదాయశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మొదటి అడుగుగా అన్ని ఆలయాల్లో ఆన్ లైన్ సేవలు అమలు చేసారు. ఈ విధానాన్ని కూడా కొందరు సాంకేతిక పరిజ్ఞానం కల్గిన యువకులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. దాంతో దేవాదాయ శాఖ మరో అడుగు ముందుకు వేసి అభిషేకం టిక్కెట్లు కట్టడికి చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇక మీదట ఒక భక్తునికి అభిషేకం టిక్కెట్లు 15రోజులకొక మారు మాత్రమే అవకాశం అంటూ ఉత్తర్వులు జారిచేసారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి ఇక్కడి అధికారులు ఈ అవకాశాన్ని 10రోజులకొక మారు అంటూ ఖరారు చేసారు. ప్రస్తుతం ఆన్‌లైన్ వ్యవస్థ నడుస్తుంది కాబట్టి 'సెల్‌ఫోన్లో' బుక్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'అభిషేకానికి' శ్లాట్ బుక్ చేయాలనుకుంటే ఒక నెంబర్‌పై 15రోజులకొక మారు మాత్రమే అవకాశం ఉంటుంది. భక్తులకు దళారుల బాధను తప్పించుటకు 'భక్తునికి భగవంతునికి సానిహిత్యం' పెంచుటకు దేవాదాయశాఖ చక్కటి నిర్ణయం తీసుకుంది. అంటే భక్తులు ఇక మీదట ఎప్పుడు స్వామి అమ్మవార్లకు అబిషేకాలు జరపాలనుకుంటే సరాసరి బుక్ చేసుకోవచ్చు. అయితే దళారులు ఈ అవకాశాన్ని కూడ సద్వినియోగం చేసుకొనుటకు ఎవరిదో ఒక నెంబర్‌తో బుక్ చేసుకుంటూ తమ పబ్బం గడుపుకుంటు న్నారు. అయితే దేవాదాయశాఖ మాత్రం చక్కటి నిర్ణయం తీసుకుంటున్నారు. కొత్త వ్యవస్థ మొదట్లో కొంత విమర్శలు ఎదుర్కొవచ్చు. భక్తులు ఇబ్బంది పడవచ్చు. కానీ అలవాటు పడతారు. అంటే ఒక ఫోన్ నెంబర్ నుంచి ఒకసారి అభిషేకం టిక్కెట్లు బుక్‌చేసుకుంటే మళ్ళీ 10రోజుల తరువాతనే ఆ నెంబర్ నుంచి అవకాశం ఉంటుంది.

## గురువుల కృషి వెలకట్టలేనిది

### - ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య ఎం.సి.మల్లయ్య



కుప్పం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త

విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిదని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.సి. మల్లయ్య పేర్కొన్నారు. ద్రవిడ వర్సిటీలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆయన ఒక ఉపాధ్యాయుడిగా ప్రస్థానం మొదలు పెట్టి దేశ రాష్ట్రపతిగా పనిచేశారన్నారు. ఈ సందర్భంగా వర్సిటీలోని బోధన సిబ్బందికి వాలీబాల్, బాడ్మింటన్, షటిల్, క్రికెట్ పోటీలు, మహిళలకు త్రోబాల్, టెన్నికాయిట్, మ్యూజికల్ ఛైర్స్, స్పీడ్ వాక్ పోటీలు నిర్వహించి విజేతలకు ఉపకులపతి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి పళని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు జిడినెల్లూరుకు మంత్రి నారా లోకేష్



చిత్తూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తెలుగుదేశం యువ నాయకుడు వసంతకుమార్ కర్మక్రియల్లో పాల్గొని వసంతకుమార్ కుటుంబసభ్యులను పరామర్శించడానికి రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఆదివారం జిడిపెల్లూరు మండలం పెద్ద కాలువ గ్రామంకు రానున్నారు. మంత్రి నారా లోకేష్ ఆదివారం ఉదయం 7.20 గంటలకు బేగంపేట విమానాశ్రయంలో బయలుదేరి 8.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి రోడ్డు మార్గంలో మంత్రి నారా లోకేష్ తిరుపతి జిల్లా పాకాల మండలం అడుసుపల్లి గ్రామం చేరుకుని ఆంజేయులునాయుడు కుటుంబసభ్యులను పరామర్శిస్తారు. అక్కడి నుండి మంత్రి నారా లోకేష్ రోడ్డు మార్గంలో బయలుదేరి జిడినెల్లూరు మండలం పెద్ద కాలువ గ్రామం చేరుకుని ఇటీవల మృతి చెందిన వసంతకుమార్ కుటుంసభ్యులను పరామర్శిస్తారు. ఉదయం 11 గంటలకు మంత్రి నారా లోకేష్ పెద్దకాలువ గ్రామం నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి హైదరాబాదు బయలుదేరి వెళ్తారు.

### సిఎం చంద్రబాబు భరోసాతో...

# తిరుపతి మేయర్ పీఠంపై ఆసక్తికర పోటీ!

### -యువ ఆశావహుల్లో పెరిగిన ఆసక్తి

ప్రభాతవార్త-తిరుపతి:

స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పనితీరు ఆధారంగానే జరుగుతుందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేయడంతో తిరుపతి మేయర్ పదవిపై రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తి పెరిగింది. ప్రజలు, కార్యకర్తల ఆమోదం ఉన్న యువత మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన ప్రకటనతో వివిధ పార్టీలకు చెందిన పలువురు యువ నేతలు మేయర్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. బిసిలకు 34 శాతం, అంతకంటే ఎక్కువ ప్రాతినిధ్యం కల్పిస్తామని సిఎం ప్రకటించిన నేపథ్యంలో సామాజిక సమీకరణాలు కూడా తిరుపతి మేయర్ అభ్యర్థి ఎంపికలో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. కూటమి పార్టీల మధ్య మేయర్ స్థానం విషయంలో అవగాహన ఎలా కుదురుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. మేయర్ పదవిని జనసేన నేతలు ఆశిస్తున్నా తిరుపతిలో టిడిపికి బలమైన రాజకీయ పునాదులుండటంతో దీన్ని దృష్టిలో ఉంచుకుని మేయర్ స్థానం టిడిపికే దక్కుతుందని మరికొందరు వాదిస్తున్నారు. టిడిపి ఇన్‌చార్జిగా బలిజ సామాజిక వర్గానికి చెందిన జె.బి. శ్రీనివాస్ కొనసాగుతున్నారు.

**సామాజిక సమీకరణాలపై చర్చ:**

తిరుపతి మేయర్ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలు కూడా చర్చకు వస్తున్నాయి. బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఊకా విజయకుమార్ నామినేటెడ్ పదవుల్లో ఉన్నారు. నరసింహ యాదవ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉండగా, అన్నా అనిత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రుద్రకోటి సదాశివం నామినేటెడ్ పదవిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి మేయర్ పదవిని తమ సామాజిక వర్గానికి కేటాయించాలని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరు నేతలు కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇంకా తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి చంద్రగిరి ప్రాంత వాసి కావడంతో ఆయనను తిరుపతి స్థానిక నాయకుడిగా పరిగణించకూడదనే వాదన కూడా వినిపిస్తున్నారు. మరోవైపు కమ్మ సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తే సమతుల్యత ఏర్పడుతుందని కొందరు టిడిపి నేతలు సూచిస్తున్నారు.






**-యువతకే అవకాశం అంటున్న బాబు?:**

అయితే కులం, వర్గం కంటే పనితీరు ప్రజాదరణ, కార్యకర్తల ఆమోదం, యువతకు ప్రాధాన్యత వంటి అంశాలే అభ్యర్థి ఎంపికలో కీలకంగా మారవచ్చనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. టిడిపి తరపున డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి, అన్నా అనితా యాదవ్, బివి కీర్తి, కె.నరసింహ, దంపూరి భాస్కర్ యాదవ్, కంకణాల రజనీకాంత్‌నాయుడు, డాక్టర్ కోడూరు బాలు, ఆర్‌సి మునికృష్ణ, పెనుమాడు ప్రణీత్ తదితరులు మేయర్ టికెట్ కోసం తమ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన నుండి ఆరణి మదన్, కిరణ్ రాయల్, అకేపాటి సుభాషిణి పేర్లు కూడా ఆశావహుల జాబితాలో వినిపిస్తున్నాయి. బిజెపి నుండి సామంచి శ్రీనివాస్, గుడిపల్లి పృథ్వీ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొత్తంగా చూస్తే తిరుపతి మేయర్ పీఠం కోసం కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, సామాజిక సమీకరణాలు, స్థానికంగా పార్టీకి ఉన్న బలం, అభ్యర్థి వ్యక్తిగత ప్రజా దరణ, యువత-మహిళలకు ప్రాధాన్యత వంటి అంశాలు కీలకం కానున్నాయి. అభ్యర్థుల ఎంపిక విధానం అమలైతే, కేవలం సామాజిక వర్గ సమీకరణాలకే కాకుండా అభ్యర్థుల వ్యక్తిగత సామర్థ్యం, ప్రజలతో అనుబంధం, పార్టీ కోసం చేసిన కృషి కూడా తుది ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

# తిరుపతి డివిజన్

## బీసీలకు అండగా... బీసీవై పార్టీ...



**రెడ్డిపాక మహేష్**

ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త బీసీలకు అండగా బీసీవై పార్టీ ప్రధాన అజెం డాగా ఎన్నికల బరిలోకి అడుగుపెడుతున్నట్లు బిసివై పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డి పాక మహేష్ తెలిపారు ఆయన శనివారం ప్రభాత వార్తతో మాట్లాడుతూ మా అధినా యకుడు బోడె రామచంద్రయ్య యాదవ్ ఆదేశాల మేరకు విజయమే పరమావధిగా తిరుపతి జిల్లాలో బీసీవై పార్టీ శ్రేణులు ఒక సైనికుల పనిచేస్తున్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు అంతేకాకుండా స్థానిక ఎన్నికల్లో కూడా పార్టీని బలోపేతం చేసి ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ఆయన అన్నారు అన్ని విధాల బీసీలకు ఎన్నికలలో 50 రిజర్వేషన్ కల్పిస్తూ మా నాయకుడు నిర్ణయం తీసుకున్నారన్నారు బీసీలకు అండగా బీసీవై పార్టీ ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నాయకులు పాల్గొన్నారు

## కులాల వారీగా ఓటరు జాబితా పరిశీలించాలి

**ఏపీఎం నిరంజన్ కుమార్**



పెనగలూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజ కవర్గం పెనగలూరు మండలంలో ఎస్సి, ఎస్టీ, బీసీలకులాల వారీగా అధికారులు సిద్ధం చేసిన ఓటర్ జాబితాను ప్రజలు పరిశీలిం చాలని ఏపీఎం నిరంజన్ కుమార్, పంచా యతీ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం నా యుడు తెలిపారు. శనివారం మండల పరిధి లోని గ్రామ పంచాయతీ లలో గ్రామ సభలు నిర్వహించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షులు కొత్త బాలకృష్ణ, గంధంశెట్టిరామయ్య, పంచెటి గంగిరెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీల ఉన్నతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీల ఉన్నత అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని రైల్వే కోడూరు శాసనసభ్యులు ఆర్వ శ్రీధర్ అన్నారు శని వారం విజయవాడ సచివాలయంలో నిర్వ హించిన ఎస్సీ ఎస్టీల ఉన్నతి అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న కమిటీలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాలలో అభివృద్ధి విద్య వైద్యం ఎస్సీ ఎస్టీల ప్రజల సమస్యల పరిష్కారం ఉద్యోగులకు అన్ని విధాల ప్రమోషన్ లా విషయంలో ఎటువంటి సమస్యలు లేకుండా రైల్వే కోడూరులో ఉన్న దళితులకు సంబంధించిన సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు అన్ని విధాల ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కలెక్టర్లు పాల్గొన్నారు

## ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలి : యుటిఎఫ్

పెనగలూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త



ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సి న బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పెనగలూరు మండలం ఎంఈవో గిరి వరదయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. హరి ప్రసాద్ తెలిపారు. శనివారం చక్రంపేట ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గ మండల విద్యాశాఖ అధికారి గిరివరదయ్య, ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాల కృష్ణ, ఐ. గంగాధర్ బాబు, పి. వెంకట సుబ్బయ్య, బి. రమణయ్య, కె. డేవిడ్ కుమార్ లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలంగా వుంటేనే సమాజ భవిష్యత్తు బలంగా వుంటుందని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీ పోస్ట్ లను భర్తీ చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. మండల విద్యా శాఖ పురోగతికి, పాఠశాలల పురోభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులను శాలువా, మెమెంటో, మెడల్ తో ఘనంగా సన్మానించడం జరిగింది. మండల స్థాయి క్రీడా పోటీలలో విజేతలకు మరియు పాల్గొన్న వారిని మెమంటోలు, మెడల్స్ తో సత్క రించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు హరి ప్రసాద్, శ్రీనివాస కుమార్, నరసింహారావు, వాణి, నజీమ్, సురేంద్ర, పద్మశ్రీ,తిరుమలమ్మ,క్రిష్ణ కుమారి,అన్వర్, శ్రీనివా సులు,ప్రమీల, సుదర్శన్, మహేంద్ర, పరిమళ, షబానా, ప్రమోద్ కుమార్ రెడ్డి, శివ నరసింహులు, జ్యోతి, సుకన్య, గిరి, హసనయ్య,రాంబాబు, వెంకట రమణ, శశిధర్, ప్రసన్న,లక్ష్మీ ప్రసన్న, రాజేశ్వరి, బాబా ఫకృద్దీన్, హరి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుదేశంపార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**కొత్త బాలకృష్ణ, దామోదర్ నాయుడు**

పెనగలూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో తెలుగుదేశం పార్టీ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ మాజీ మండల అధ్యక్షులు, ఎక్స్ ఎంపీటిసి కొత్త బాలకృష్ణ, సీనియర్ నాయకుడు దాసరి దామోదర్ నాయుడు తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెనగలూరు గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మోడీ సుబ్బరాయుడికి డాక్టరేట్ అందజేత



రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త

రైల్వే కోడూరు మండలంలోని కొత్త కోడూరుకు చెందిన రిటైర్డ్ ఏపీఎండిసి ఉద్యోగస్తులు నాటక రంగ కోవిదులు మోడీ సుబ్బరాయుడుకు శనివారం న్యూఢిల్లీలోని సోక్రటీస్ సోషల్ యూనివర్సిటీ నుండి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గౌరవ డాక్టరేట్ ను మోడీ సుబ్బరాయుడు కు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మోడీ సుబ్బ రాయుడు మాట్లాడుతూ నాటక రంగాలలో ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో అవార్డులు మరియు ప్రశంసా పత్రాలు అందుకున్న నేపథ్యంలో వారి సేవలను గుర్తిస్తూ శనివారం న్యూఢిల్లీలో గౌరవ డాక్టరేట్ ను అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన విలేకరులకు తెలిపారు. ఈ గౌరవ డాక్టరేట్ తనకు మరింత బాధ్యతను ఇచ్చిందని మంచి నాటకాలతో ప్రజలను ఆకట్టుకుంటానని ఆయన తెలిపారు. ఈ ఆయన శ్రీమతి తో పాటు సోక్రటీస్ యూనివర్సిటీ కి చెందిన అతిరథ మహారథులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

రేణిగుంట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



రేణిగుంట మండలం మల్లవరం మల్లారెడ్డి డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్‌లో శనివారం ఉపా ధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ప్రముఖ ఏరోస్పేస్ శాస్త్రవేత్త, మాజీ డీఆర్‌డీఓ ఛైర్మన్ డా. జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, నిరంతర కృషితో వాటిని సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్ప థాన్ని పెంపొందించేం దుకు నాణ్యమైన పరిశోధనలు, వినూత్న ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ద్వారా ఉన్నత విద్యలో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని విశ్వవిద్యాలయ ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి. యువరాజ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ పుం స్కార గ్రహీత ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. డీన్ డా. మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఎన్. సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు కుప్పం తమ్ముళ్లతో సిఎం చంద్రబాబు సమావేశం

### - అమరావతికి పయనమైన కీలక నేతలు !!

కుప్పం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇటీవలే నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో సిఎం చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తమ నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించి వారికి తగు సూచనలిచ్చారు. తాజాగా కుప్పంలో పార్టీ పరంగా కీలకనాయకులతో ఆదివారం ఉండ వల్లిలోనే సమీక్షా సమావేశం జరపనున్నారు. సిఎం నుంచి పిలుపురావడంతో కుప్పం నుంచి ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, ఇతర కోర్‌కమిటీ నాయకులు శనివారం సాయంత్రం రాజధాని అమరావతికి పయనమయ్యారు.

## ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ : ఎమ్మెల్యే

విజయపురం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:



ఎన్‌డీయే కూటమి ప్రభుత్వంలో రైతులకు భూమిపై హక్కుతో పాటు మరింత భరోసా కల్పించేందుకే రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేస్తున్నట్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొ న్నారు. మండలంలోని ఆలపాకం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎమ్మెల్యే చేతుల మీదుగా రీ సర్వే అనంతరం ముద్రిం చిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీయే కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపుతూ పారదర్శకంగా భూ రికార్డులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, భూ హక్కులు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం విజయపురం మండలంలోని అనారోగ్య బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలోనగరి ఆర్డీవో అనుపమ, మండల తహసీల్దార్ మునిశైలజ, ఎంపీడీవో కృష్ణయ్య, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ అశోక్, డిప్యూటీ తహసీల్దార్ అఫ్రష్ అలీ, మండల సర్వేయర్ శేఖర్, ఎంపీపీ లక్ష్మి పతిరాజు, స్థానిక టీడీపీ నాయకులు రమేష్‌రాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, శివలింగం, రవిచంద్రరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వెంకమరాజు



విజయపురం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:

విజయపురం మండల కేంద్రంలో శనివారం మండల విద్యాశాఖ ఆధ్వ ర్యంలో జరిగిన గురు పూజోత్సవ వేడుకల్లో శ్రీహరిపురం ఆదర్శ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న దొమ్మరాజు వెంకమ రాజుకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఎంఈవోలు శ్యామల, శ్రీనివాసులు అందజేశారు. ఆదర్శ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పనకు వంద శాతంపిల్లలనమోదు,విద్యాభివృద్ధికి చేసిన విశిష్ట కృషికి ఈ అవార్డు ఇస్తున్నట్లు ఎంఈవోలు పేర్కొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన

రేణిగుంట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



వినాయక చవితి సందర్భంగా విగ్రహాల నిమజ నానికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచే సుకోకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టేం దుకు అధికారులు చర్యలు ప్రారంభిం చారు. ఇందులో భాగంగా రేణిగుంట డీఎస్పీ శ్రీనివా సరావు ఆదేశాల మేరకు రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, రేణిగుంట మండల అభివృద్ధి అధికారి రవిచంద్రతో పాటు సంబంధిత అధికా రులు అనసంపల్లి, వెంకటాపురం, కరకంబాడి చెరువులను శుక్రవారం పరిశీలించారు. వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, వాహనాల రాకపోకలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామస్తులు నాయకులు అధికారులతో కలిసి పరిశీలించారు . నిమజ్జన ప్రదేశంలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ తగిన బారికేడింగ్, లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించే అంశాలపై చర్చించారు. ప్రజలు, భక్తులు పోలీసు అధికారుల సూచనలు పాటించి ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని సూచించారు.

## రైల్వే పార్సెల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీసులు

రేణిగుంట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని పార్సల్ కార్యాలయంలో అర్బన్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిం చారు. రేణిగుంట-తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పార్సల్ కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చారు.రైల్వే పార్సల్ వ్యవస్థ ద్వారా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వస్తువులు, సరుకులు రవాణా అవుతున్న నేపథ్యంలో వాటి భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమానాస్పదంగా కనిపించే పార్సిళ్లు, సరైన వివరాలు లేని సామగ్రి, నిబంధనలకు విరుద్ధంగా రవాణా అయ్యే వస్తువులపై ప్రత్యేకంగా నిఘా ఉంచారు. పార్సల్ బుకింగ్, రవాణా ప్రక్రియలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలను కూడా పరిశీలించారు.ప్రజల భద్రతకు ముప్పు కలిగించే అక్రమ వస్తువులు, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాలు లేదా ఇతర నిషేధిత సామగ్రి రవాణాకు రైల్వే పార్సల్ వ్యవస్థను ఎవరూ దుర్వినియోగం చేయకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు సిఐ జయచంద్ర తెలిపారు. అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

## గురువే మార్గదర్శి సమాజ నిర్మాణానికి శిల్పి : ఎంఈవోలు



సత్యవేడు, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:

విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడంతో పాటు వారి భవిష్య త్కు బాటలు వేసే మార్గదర్శి గురు వని సమాజ నిర్మాణానికి శిల్పని తిరుపతి జిల్లా సత్యవేడు మండల విద్యాశాఖ అధికారి రవి అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం టీచర్స్‌డేని పురస్కరించుకుని నిర్వహించిన పురుషులకు వాలీబాల్, క్రికెట్, రన్నింగ్ రేస్, మహిళలకు త్రో బాల్, కబడ్డీ, రింగ్‌బాల్ పోటీల్లో విజేతలైన అందరికి దాదాపు వంద బహుమతులను ఎంఈవో రవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లతో కలిసి ప్రదానం చేశారు. అంతకు ముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ టీచర్ లతమ్మకు శాలువ కప్పి ఘనంగాసన్మానించారు.ఉపాధ్యాయ సంగం నేతలు త్యాగరాజు, సురేష్, శ్రీనివా సులు, ప్రభావతి, సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్‌తో కలసి ఆధునిక వైద్యంపై ఎంబియులో సదస్సు

చంద్రగిరి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

ఆయుష్‌తో కలసి ఆధునిక కమ్యూనిటీ మెడిసిన్‌పై ఈ నెల 7,8 తేదీలలో మోహన్‌బాబు యూనివర్శిటీలో ఐసిఎస్‌ఎస్ఆర్ జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఎంబియు రిజిస్ట్రార్ సారథి తెలిపారు. ఆధునిక వైద్యంతో మన సంప్రదాయ ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియోపతి విధానాలను సమన్వయం చేస్తూ ఆయుష్ విభాగంతో జతకట్టనున్నట్లు వెళ్ళడించారు. అందరికీ అందుబాటులో వుండే విధంగా స్థిరమైన ప్రజారోగ్య వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా ఎంబియులో జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## పదోన్నతి పొందిన హెడ్‌కానిస్టేబుళ్లకు డీఎస్పీ అభినందనలు



రేణిగుంట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

రేణిగుంట సబ్‌డివిజన్ పరిధిలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన బీడీ.జగన్మోహన్ (రేణిగుంట), పి. బాలకృష్ణ (గాజులమండ్యం), ఈ. శ్రీపతి (ఎయిర్‌పోర్ట్), వి .రమణ (చిట్వేల్), వి.వెంకటయ్య (ఓబులవారిపల్లె), ఎం. కవిత (ఏర్పేడు)లను రేణిగుంట డీఎస్పీ శ్రీ వై. శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.పోలీస్ శాఖలో పదోన్నతి అనేది మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేసే అవకాశమని డీఎస్పీ అన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యలను సామరస్యంగా విని, చట్టపరంగా వేగవంతంగా స్పందిస్తూ ప్రజానుకూల పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేసి పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్స్ రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీని వాసులు ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర పర్యటనలో పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు

విజయపురం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్‌నాయకులు ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్నారని ఏపీ పంచాయ తీరాజ్ ఛాంబర్ ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయ తీరాజ్‌ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయ యా దవ్ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో పాల్గొ న్న ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులకు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వినోద్‌రాజు ఘన స్వాగతం పలికి, అనకాపల్లి జిల్లా ఉప్మాక గ్రామంలోని శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి దర్శనం చేయించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం పొందిన అనంతరం పర్య టన కొనసాగిందన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కడప జిల్లాకు చెందిన కొత్తపు మునిరెడ్డి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా సి.వెంకటేష్ ఎంపిక

పుత్తూరురూరల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోపని చేస్తున్న సివిల్ అధ్యాపకులు సి.వెంకటేష్ ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.కుమార్ తెలిపారు. వెంకటేష్ గత సంవత్సరంలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ)న్యూ ఢిల్లీ ద్వారా బెస్ట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ టీచరు, బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్ టీచరు ఇన్ ఆంధ్రప్రదేశ్ అవార్డులు వచ్చాయని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పాలిటెక్నిక్ ఉపాధ్యాయ పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్న సి.వెంకటేష్‌కి పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ విబాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**– ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్**

పుత్తూరురూరల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:



పుత్తూరు మండల విద్యాశాఖ పరిధి లో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ జయం తిని పురస్కరించుకుని మండల వి ద్యాశాఖ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూళ్ళను, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం గురించి విద్యార్థుల వెనుకబాటు తనానికి ప్రభుత్వం గుర్తించి డీఎస్సీలో 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, ప్రభుత్వం మోడల్ ప్రైమరీ స్కూళ్ళను తీసుకుని వచ్చి విద్యార్థుల్లో నాణ్యమైన విద్యను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి ఎనలేనిదని తెలుపుతూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ స్టేట్‌డైరెక్టర్ గంజిమాధవయ్య, మండల అభివృద్ధి అధికారి శ్రీదేవి, మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, పుత్తూరు ఎస్ఐ నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

చంద్రగిరి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఇందులో భాగంగా ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు ఆధ్వర్యంలో మండల స్థాయి 14 మంది ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీతలను, 6 మంది సిఆర్‌ఎంటి ఆఫీస్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా తిరుపతి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన కొటాల ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పి.రాజేం ద్రబాబును, రాయలపురం పంచాయతీ, వెంకటంపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మీని ప్రత్యేకంగా ఎంఈఓలతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## ప్రశాంత వాతావరణంలో చవితి ఉత్సవాలు జరుపుకోండి

**ఎస్ఐ భక్తవత్సలం**

రామచంద్రాపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్ఐ భక్తవత్సలం కమిటీ సభ్యులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశం, నిమజ్జన కార్యక్రమాలపై పోలీసులకు ముందుగానే సమాచారం అందించాలన్నారు. మండపాలలో అనుమతి పత్రాలను అందుబాటులో వుంచాలన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని మూడవ రోజే చేపట్టాలని కోరారు. ఉత్సవాలలో డిజెలు, అశ్లీల నృత్యాలు నిషేధమన్నారు. నిమజ్జనానికి ఏర్పాటు చేసిన వాహనాలను నడిపే డ్రైవర్లు మత్తు పధార్థాలను సేవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన ప్రదేశాలలో విద్యుత్ లైట్లు, బారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఎంఈఓ మార్కొండయ్య నాయుడు, విద్యుత్‌శాఖ ఏఈ గిరి, ఇరిగేషన్ ఏఈ యతిరాజులు, తదితరులు పాల్గొన్నారు.

## గురువే సమస్త లోకాలకు మార్గదర్శకులు

**ఏపి ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చినబాబు**

రామచంద్రాపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:




గురువే సమస్త లోకాలకు మార్గదర్శ కులని ఏపి ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చినబాబు అన్నారు. శనివారం మం డల పరిషత్ కార్యాలయంలో ఉపా ధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత సొరకా యల పాళ్యం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రామాంజనేయులును దుశ్శాలువతో సన్మానించి అభినందించారు. ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలులను ఉపాధ్యాయులతో కలసి టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి శాలువకప్పి సన్మానించారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానించి అభినందించారు.

## సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులు

రేణిగుంట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రేణిగుంటలోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శనివారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు డి. జూలియన్ రాజు, ముఖ్య సలహా దారు డి. అమ్ములు రాజు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ.. ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన రాధా కృష్ణన్ జయంతిని గురుపూజోత్సవంగా నిర్వహిం చుకోవడం గర్వకారణమన్నారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి విజ్ఞాన వెలుగులు నింపే గురువులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల అనంతరం గురువులకు సమాజంలో అత్యున్నత స్థానం ఉందని, గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి పనిచేయాలి

**-రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే**



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లి లోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇతర ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దళిత, గిరిజన వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఎస్సీ, ఎస్టీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో అణగారిన వర్గాల ఆర్థిక సాధికారత, సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నిధుల కేటాయింపులు, పథకాల అమల్లో పారదర్శకతను పాటిస్తూ వారికి మెరుగైన భవిష్యత్తును అందించడం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి ఉపయోగపడేలా చేసేందుకు ప్రజా ప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని ఆ దిశగా తాము పని చేస్తున్నట్లు వెల్లడించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఉపాధ్యాయ వృత్తి సమాజంలో గౌరవప్రదమైనది

**- ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గు మాటి హరిరావు**



బాలాయపల్లి, సెప్టెంబర్ 5 ప్రభాత వార్త: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో గౌరవప్రదమైనది అని ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్, రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ జాతీయ రాష్ట్రస్థాయి రెడ్ క్రాస్ సంస్థ ట్రెజరర్ దగ్గుమాటి హరిరావు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మదర్ అకాడమీ స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలేసి నివాళులర్పించారు. చిన్నారులను బావి భారత పౌరులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయులు అని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని చెప్పారు. రక్తదానం మరొకరికి ప్రాణదానం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జె ప్రకృతి కుమార్, హైకోర్టు న్యాయవాది తోట పవన్ సాయి, వెంకటగిరి స్వామి వివేకానంద యువసైన్యం సభ్యులు, మదర్ అకాడమీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## గురువుల పట్ల భక్తి భావంతో మెలగాలి

**- ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సంయుక్త**



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: ప్రతి మనిషి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో కీలక పాత్ర పోషించేది గురువేనని వారి పట్ల భక్తి భావంతో మెలగడం మన అందరి బాధ్యత అని స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పి.సంయుక్త అన్నారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకొని కష్టపడి చదివి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. నేటి సమాజంలో అనేక రకాలుగా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు మహిళలు సిద్ధంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే వారిపై ఫిర్యాదు చేసి న్యాయం పొందాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు గురువులను పూజించాలని కోరారు. అనంతరం న్యాయవాదులు అనేక చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి లక్ష్మయ్య, ధర్మ ప్రసాద్, న్యాయవాదులు ఈ మాల కొండయ్య, సి చక్రవర్తి, లోక్కు చలపతి తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ



తడ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: తడ మండల పరిధిలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాలైన పులివెందల, అక్కంపేట రైతులకు శనివారం సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్ రెడ్డి చేతుల మీదుగా రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తడ ఎమ్మార్వో రవికుమార్ వీఆర్వో జ్ఞానయ్య రైతులు పాల్గొన్నారు.

## డ్రైవర్ మృతి



తడ,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: మండలం మాంబట్టు సెజ్ పరిధిలోని ఈప్యాక్ పరిశ్రమ వద్ద ఘోర ప్రమాదం జరిగింది లారీ క్రింద మరో లారీ డ్రైవర్ నిద్రిస్తుండగా డ్రైవర్ లారీని ముందుకు నడపడంతో లారీ క్రింద ఉన్న డ్రైవర్ తలభాగం బాగా నలిగిపోవడంతో శరీరంలోని వివిధ భాగాలు దెబ్బ తినడంతో అక్కడికక్కడే మృతి చెందాడు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జనవాణికి వెల్లువెత్తిన 45 వినతులు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 45 వినతులు అందాయి. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వినతుల్లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు 3, సహాయ కమిషనర్‌కు 9, ఎస్ఈకి 11, ఆరోగ్య అధికారికి 7, పోలీసు శాఖకు 6, తహసీల్దార్‌కు 2 చొప్పున అందాయి. టౌన్ ప్లానింగ్, హౌసింగ్ ఈఈ, డీఈఓ, నారాయణ పాఠశాల యాజమాన్యం, ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయి. ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించి 2 వినతులు అందాయి. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే పంపించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా, వినతులను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారి ఓం ప్రకాష్, ఎస్పీడీసీఎల్ ఏడి ఆంజనేయులు, ఏఈ ఉమాపతి, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి స్థల పరిశీలన



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ప్రాంతంలో జరగనున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని నిమజ్జనం చేయడానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు శనివారం ప్రారంభించారు. ప్రతి ఏటా నిర్వహించే శ్రీ చెంగాళమ్మ దేవస్థానం సమీపంలోని కాళంగి నదిలోని గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించాలని స్థానిక సీఐ ఎం మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.చెన్నయ్యలు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి కాళంగి నది నిమజ్జన ప్రాంతాన్ని శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

## నేడు పోలేరమ్మ ముఖద్వారం ప్రారంభం

వెంకటగిరి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త : పాలశీతల కేంద్రం కూడలిలో దాతల సహకారాలతో నిర్మించిన పోలేరమ్మ అమ్మవారి ముఖద్వారాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్,నెల్లూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు అజిత వేజెండ్ల, సుబ్బరాయుడు, బెంగళూరు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోన వంశీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

# ఉత్తమ గురువులకు అవార్డులు




చిత్తూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 72 మంది ఉపాధ్యాయులను శనివారం జడ్పీ సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌లు అవార్డులు బహుకరించి సత్కరించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా లెక్చరర్ల కేటగిరిలో ఇద్దరు, హెడ్మాస్టర్ల కేటగిరిలో 11 మంది, ప్రిన్సిపాల్ కేటగిరిలో ఒకరు, పిజీటీ కేటగిరిలో ముగ్గురు, 23 స్కూల్ అసిస్టెంట్లు, 5 మంది పిఎహెచ్‌ఎంలు, టీజీటి విభాగంలో ఒకరు, 23 మంది ఎస్‌జిటిలు, ఒక పిఇటి, ఇద్దరు ఐఇఆర్డీ, ఒక సీఆర్‌టిలు ఎంపికయ్యారు.

లెక్చరర్ల విభాగం: ఎం.మోహన్‌రెడ్డి, ప్రభుత్వ డైట్, కార్వేటినగరం, ఆర్.సుధారాణి, కార్వేటినగరం

హెడ్మాస్టర్ల కేటగిరి: బి.చెంగల్రాజు(కత్తిరపల్లి, కార్వేటినగరం), ఎం.వెంకటనాగేశ్వర్ (పైపాళ్యం, కుప్పం), ఎస్ఎం గిరిరాజు(టేకుమంద, బంగారుపాళ్యం), కెఎస్ రాజ్యలక్ష్మి(మంగళపల్లి, బంగారుపాళ్యం), సి.సుజాత(బాలికల ఉన్నత పాఠశాల, పలమనేరు), చంద్రమ్మ(దండికుప్పం, శాంతిపురం), వి.సురేష్‌కుమార్(గంగమాంబపురం, విజయపురం), ఎపి లలిత( కె.గొల్లపల్లి, ఎస్ఆర్‌పురం), కె.హేమాద్రి(ఎస్ఆర్‌పురం), కె.దుర్వాసులు( నరహరిపేట, గుడిపాల), ఎస్.ధనంజయ(బాలుర ఉన్నత పాఠశాల, రామకుప్పం).

ప్రిన్సిపాల్ కేటగిరి: టిఎస్ అనిత(ఎపి మోడల్ స్కూల్, కమ్మనపల్లి, బైరెడ్డిపల్లి)

పిజీటి కేటగిరి: యు.శైలజ(కెజీబీవీ, గుడుపల్లి), కె.శ్రీధర్(జడ్పీహెచ్‌ఎస్ ప్లస్, జిడినెల్లూరు), బి.నాగరాజు (ఎంజెపిఎ,పిడిసిడబ్ల్యుఆర్ స్కూల్(బాలురు), కుప్పం)

స్కూల్ అసిస్టెంట్ కేటగిరి: చంద్రశేఖర్(బెజ్జెలిపల్లి, గుడుపల్లి), ఎం.విజయ కుమార్ (యామదరి), వి.పిళ్ళారప్ప (గుండ్లకట్టమంచి, బంగారుపాళ్యం), వై.విజయకుమార్(కన్నమాకులపల్లి, శాంతిపురం), జి.దాము(ఎం.కొత్తూరు, నగరి), జి.అమరనాథ్(తుమ్మింద, చిత్తూరు), శ్రావణ్(చిత్తపార, గుడిపాల), ఎస్.ఉమాపతి(వీఆర్‌కుప్పం, పాలసముద్రం), ఎఎన్ బాలాజీ(గంద్రాజుపల్లి, గంగవరం), కె.ఉమాశంకర్(నేతంకంద్రిగ, నగరి), ఎస్.లాల్సాహెబ్ (జడ్పీహెచ్‌ఎస్ బాలురు, రొంపిచెర్ల), సి.కామరాజ(పెంగరగుంట, పలమనేరు), కెఎస్ కన్నన్(జడ్పీహెచ్‌ఎస్ బాలురు, వి.కోట), ఎం.చంద్రమనాయుడు (తూగుంద్రం, జిడినెల్లూరు) సి.రామయ్య(కల్లుపల్లి, గంగవరం), కె.గణపతి నాయుడు (బాలగంగనపల్లి, జిడినెల్లూరు), ఎన్.గణేష్(పులిచెర్ల), జె.సుధాకర్ నాయుడు (పుల్లూరు, ఎస్ఆర్‌పురం), ఎం.ముత్తు(ఎండి మంగళం, జిడినెల్లూరు), జి.రవి(ఎంపిపిఎస్, ఎల్లింకివారిపల్లి, పులిచెర్ల), కె.కుమారస్వామి (పోలవరం, పూతలపట్టు), ఎన్.అలియాబేగం (జడ్పీహెచ్‌ఎస్ (ఉర్దూ), న్యూపేట్, పలమనేరు), కె.రవి(పూతలపట్టు)

పీఎస్‌హెచ్‌ఎం కేటగిరి: కె.రవి(పూతలపట్టు), కెపరమారాణి(గుండుబావి, పలమనేరు), ఎ.జార్జి(పూతలపట్టు), ఎం.మోహన్(కాణిపాకం, ఐరాల), జి.ముక్తార్ అహ్మద్(చిత్తూరు), టి.రవి(దిగువకల్లదు, పలమనేరు),

టిజిటి కేటగిరి: విక్టోరియారాణి(ఎంజెపిఎపిడిసిడబ్ల్యుఆర్ స్కూల్(బాలికలు), పెద్దపంజాణి), పి.మనోహర్‌నాయుడు (పెద్దమల్లెల, రొంపిచెర్ల),

సెకండరీ గ్రేడ్ టీచర్ల కేటగిరి: రంగనాథం(కె.గొల్లపల్లి, యాదమరి), ఎం.సురేఖ (చెల్లంపల్లి, బైరెడ్డిపల్లి), ఎన్.శ్రీదేవి(వెప్పాలమానుచేను, గుడిపాల), శశికళ (కీనాటంపల్లి, యాదమరి), కె.గీత(కొత్తపల్లి, గంగవరం), సిఎన్.రఘుపతి (కుంబార్లపల్లి, వి.కోట), వైఆర్ కృష్ణయ్య(భూమిరెడ్డిపల్లి, యాదమరి), సయ్యద్ ఫకీర్ భాషా(మద్దలయ్యగారిపల్లి, పూతలపట్టు), పి.గిరి(దొమ్మండ్లపల్లి, పూతలపట్టు), షేక్ సహనాజా(జిడిమాకులపల్లి, గంగవరం), కె.నాగరాజు (సన్యాసిపల్లి, పెనుమూరు), ఎ.బాగ్యరాజ్(అలపాకం, విజయపురం), ఎం.భాస్కర్‌రాజు (మల్లెపల్లి, గుడుపల్లి), డి.శిరీషారాణి(నీలందాసరపల్లి, వి.కోట), జి.సురలక్ష్మి(శ్రీహరిపురం, విజయపురం), బి.శ్రీనివాసులు(మంగళం, విజయపురం), కె.మోక్షప్రద(జీఎల్ఎస్‌ఫాం, గంగవరం), ఎన్.రామోహ్మాన్ (పత్తికొండ, గంగవరం), పి.ఉమాపతి(బడుగుమాకులపల్లి, శాంతిపురం), కె.అరుణకుమారి (గంగమ్మగుడి, ఎస్ఆర్‌పురం), కె.జగదీషన్(ఆర్కేబీబీ పేట, కార్వేటినగరం)

పిఇటి కేటగిరి: తరుణ్‌తేజ్(కేజీబీవీ కమ్మనపల్లి, బైరెడ్డిపల్లి)

ఐఇఆర్టీ కేటగిరి: జి.లావణ్య(భవిత సెంటర్, పూతలపట్టు), సి.సురేఖ(వాణి భవిత సెంటర్, గంగవరం),

సీఆర్డీ కేటగిరి: ఎస్.హేమలత(కేజీబీవీ రొంపిచెర్ల)

## సమాజ సేవలో ఎస్‌బిఐ

తిరుపతి,సెప్టెంబర్ 5ప్రభాతవార్త: భారతీయ స్టేట్ బ్యాంక్ ఆర్థిక లావాదేవీలేగాక సమాజసేవకు కూడా ముందుంటుందని ఆ బ్యాంక్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల కింద 57 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని స్విమ్స్‌కు అందజేశారు. తిరుపతి ఐఐటీ ప్రాంగణంలోని విద్యార్థులు, ఉద్యోగుల రాకపోకల కోసం రెండు ఎలక్ట్రిక్ బగ్గీల కొనుగోలు చేసేందుకు 15 లక్షలు, రాస్ పరిధిలోని మహిళలకు కుట్టు మిషన్ల కోసం మరో 15 లక్షలు చెక్కును అందజేశారు. సమాజ శ్రేయస్సు, ప్రజావైద్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దాదాపు 87.26 లక్షల విరాళాలను అందించడం జరిగిందని ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. బ్యాంకు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## గోవిందా...గోవింద-భక్తితో నగరసంకీర్తన



తిరుపతి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: తిరుపతి నగరం శనివారం తెల్లవారుజామున భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. వేంకటేశ్వర స్వామి కృప కటాక్షాలు నగరమంతా విరాజిల్లాలని ఆకాంక్షిస్తూ భజన మండలి సభ్యులు శనివారం ఉదయం బ్రహ్మముహూర్తానికే సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో నగర సంకీర్తన చేపట్టారు. గోవింద.. గోవింద.. నామసంకీర్తనతో తిరుపతి వీధులన్నీ భక్తి భావంతో నిండిపోయాయి. భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులు జయమ్మ, చంద్రమోళి లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు, ప్రముఖ ప్రవచనకర్త చంద్రమోళి, మునినాథరెడ్డి, సురేంద్ర రాజు, కృష్ణంరాజు,గుండాల గోపీనాథ్‌రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, అరుణమ్మ, జయమ్మ, విజయ కుమారి, అమరావతి, పావని, ఉషశ్రీ,రేవతి, ఉమా జి, పద్మ, వై పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, కల్పన, నాగరాజామ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ...

**తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు

కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు రాష్ట్ర సమాచార (ఆర్టీఐ) కమీషనర్ గాజుల ఆదెన్న, కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్‌కుమార్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణ, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌వి వైద్య కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: ఎస్‌వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు ఆధ్వర్యంలో వైద్య ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈ కళాశాలలో పూర్వ వైద్య విద్యార్థి, వైద్య ఉపాధ్యాయుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ ఎం.ఎస్ శ్రీధర్, అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, చిత్తూరు, ముఖ్యఅతిథిగా విచ్చేసినారు అని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఎస్ శ్రీధర్‌ని శాలువాతో సత్కరించి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జ్ఞాపికను అందించి ఆయన ద్వారా ముఖ్య సందేశాన్ని ఈ తరం వైద్య అధ్యాపకులకు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి రవి ప్రభు మాట్లాడుతూ తల్లిదండ్రుల కంటే ఉన్నత స్థానం గురువుది సనాతన సంప్రదాయంలో గురువుకు తల్లిదండ్రుల కంటే ఉన్నతమైన స్థానాన్ని ఇస్తూ గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః అని కొలిచే దివ్య సంస్కృతి మనది ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వైద్య విద్యార్థులకు, నేటి తరానికి సరైన దారి చూపించే దిక్సూచి మన వైద్య ఉపాధ్యాయుడే అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం.ఎస్ శ్రీధర్ మాట్లాడుతూ అక్షరాలు నేర్పిన నాటి నుంచి, మన ఆశయాలకు రెక్కలు తొడిగి సమాజంలో ఉన్నతంగా నిలబెట్టే వరకు గురువు పడే శ్రమ వర్ణనాతీతం, మారుతున్న ఈ డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత ముందుకు వెళ్లినా ఒక గురువు ఇచ్చే ఆత్మీయ స్పర్శను, నైతిక విలువలను ఏ డిజిటల్ స్క్రీన్ కూడా భర్తీ చేయలేదు అని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుభద్రాదేవి మాట్లాడుతూ వైద్య ఉపాధ్యాయులు చెప్పే విషయాలను విమర్శలుగా కాకుండా మనల్ని సరిదిద్దే శిల్పి నిలువెత్తు శ్రమగా భావించాలి. ఈ కార్యక్రమంలో 21 మంది ఉత్తమ వైద్య ఉపాధ్యాయులుగా, వైద్య విద్యార్థుల ద్వారా ఎన్నుకొని ప్రశంస పత్రాలు అందించి, శాలువతో వారిని సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి వెంకటేశ్వర్లు డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి, డాక్టర్ మాధవి లత, అన్ని విభాగ అధిపతులు, ఉత్తమ వైద్య అధ్యాపకులు, పీజీ, యూజీ, వైద్య


## పుత్తూరు పురపాలక సంఘము

మునిసిపల్ కార్యాలయము తేది : 05-09-2026

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

ఆర్.ఓ.సి.నెం.1957/ఇ1/2025

పుత్తూరు పురపాలక సంఘము నందు **General Funds** నుండి 1 పనికి, **15th Finance Commission Grants** నుండి 1 పనికి, మొత్తం 2 పనులకు (టెండరు నిట్ నెం.51/2026-27 (3rd Call to 74/2026-27 ) అర్హతలు కలిగినవారు నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

కమీషనరు
పుత్తూరు పురపాలక సంఘము

## నగరి పురపాలక సంఘ కార్యాలయము

తేది : 05-09-2026

**ప్రకటన**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి **G.O.Ms. No. 64, MA & UD (G) Dept., dated 24.03.2026** ను అనుసరించి శ్రీయుత సంచాలకులు పురపాలక పరిపాలనశాఖ, ఆంధ్రప్రదేశ్, గుంటూరు వారు **Circular RC.No.13032/2/2026/H1-2, dated 04-09-2026 of the Commissioner & Director of Municipal Administration, A.P. Rayapudi** నుండి నగరి పురపాలక సంఘము నందు పురపాలక సాధారణ ఎన్నికలకు ముందుగా వార్డు డీలిమిటేషన్ ప్రతిపాదనలు తయారు చేయవలసినదిగా ఆదేశాలు జారీ చేయడమైనది. అందులో 2011 సెన్సస్ మొత్తం జనాభాపై 29 వార్డులను 40 వార్డులుగా విభజించి, వచ్చిన జనాభాపై 10శాతం ఎక్కువ లేక 10శాతం తక్కువ ప్రకారము అన్ని వార్డులు నుండి సమానముగా మరియు సరిహద్దులతో వార్డు విభజన చేయవలసినదిగా సూచనలు జారీ చేసియున్నారు. ప్రభుత్వము వారి సూచనలు ప్రకారము సదరు వార్డు విభజన తయారు చేసిన ప్రతిపాదనపై ప్రజలు మరియు ప్రజాప్రతినిధులు నుండి సూచనలు/ అభ్యంతరములు కొరకు ప్రచురించ వలసిందిగా ఆదేశాలు జారీ చేయడమైనది.

సదరు ఆదేశా మేరకు, వార్డులు విభజన ఓటరు సంఖ్య ప్రాతిపదికగా ప్రతిపాదనలను తయారు చేసి ఈ కార్యాలయ నోటీసు బోర్డు నందు మరియు అన్ని ప్రభుత్వ కార్యాలయపు నోటీసు బోర్డులపై మరియు నగరి పురపాలక సంఘ పరిధిలో అన్ని స్వర్ణ వార్డు కార్యాలయపు నోటీసు బోర్డులపై ప్రచురించబడినది.

అందుపై ప్రజలకు తెలియజేయడమేమనగా సదు వార్డుల విభజన ప్రతిపాదనలపై మీ యొక్క సూచనలు/ అభ్యంతరములు తేది : 11.09.2026 లోపు లిఖిత పూర్వకముగా నగరి పురపాలక సంఘ కార్యాలయములోని ప్రత్యేక కౌంటర్ నందు సమర్పించవలసినదిగా తెలియజేయడమైనది.

కమిషనరు
నగరి పురపాలక సంఘము

## పుత్తూరు పురపాలక సంఘ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.458/2026/జి1 తేది : 05-09-2026

**ప్రకటన**

విషయము : పుత్తూరు పురపాలక సంఘము - వార్డుల ముసాయిదా పునర్విభజన - వార్డుల ముసాయిదా ప్రతిపాదనల ప్రచురణ అభ్యంతరాలు/సూచనలు కోరడం-గురించి

పుత్తూరు పురపాలక సంఘ పరిధిలోని వార్డులు పునర్విభజనకు సంబంధించిన వార్డుల ముసాయిదా ప్రతిపాదనలపై దాఖలైన పిటిషన్లను విచారించిన గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు 03-09-2026 తేదీన **W.P. No.22375/2026** మరియు అనుబంధ కేసులలో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా వార్డుల ముసాయిదా పునర్విభజన ప్రతిపాదనలు రూపొందించబడినట్లు ప్రజలందరికీ తెలియజేయడమైనది.

అదే విధంగా, ఆంధ్రప్రదేశ్ పురపాలక పరిపాలకశాఖ కమీషన్ మరియు డైరెక్టర్ వారు **Roc. No.13032/2/2026/H1-1**, తేది : 04-09-2026 ద్వారా జారీ చేసిన సూచనల మేరకు, పుత్తూరు పురాలక సంఘ పరిధిలోని 36 వార్డుల ముసాయిదా పునర్విభజన ప్రతిపాదనలను ప్రజల సమాచారం మరియు పరిశీలన నిమిత్తం మరొకమారు ఈ కార్యాలయపు నోటీసు బోర్డు నందు, అన్ని ప్రభుత్వ కార్యాలయపు నోటీసు బోర్డులపై మరియు పుత్తూరు పురపాలక సంఘము పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల నోటీసు బోర్డులపై ప్రచురించబడినది.

ప్రతిపాదిత వార్డుల పునర్విభజనపై ఎవరికైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉన్నట్లయితే, వాటిని లిఖితపూర్వకంగా పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ వారికి 05-09-2026 నుండి 11.09.2026 వరకు, కార్యాలయ పని వేళల్లో సమర్పించవలసినదిగా పురపాలకసంఘ కమిషనరు డి.వి.నాగేశ్వర రావు తెలియజేశారు.

కమిషనరు
పుత్తూరు పురపాలక సంఘము

# అందరిని ఆదరించి అక్కున చేర్చుకునే అధినేత ఆర్‌ఎస్ గోయింక

## మాచినేని విశ్వేశ్వరరావు



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త.

చిన్న పెద్ద, కుల మత వర్గ బేధాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా అందరిని ఆదరించి అక్కున చేర్చుకునే మనస్తత్వం ఉన్న గొప్ప అధినేత జింపిక్స్ కంపెనీ ఫౌండర్ ఆర్ఎస్ గోయింకానేనని ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరరావు కొనియాడారు. శనివారం ఆర్ఎస్ గోయింకా సంస్మరణ సభ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట బెరైటీస్ వ్యాపారానికి గోయింకా 1973లో పిన్నవయసులోనే రావడం జరిగిందన్నారు. అప్పటి కడప జిల్లాకు చెందిన వైఎస్ రాజారెడ్డి, శనివారపు శంకర్ రెడ్డి, సీఎం రామనాథ రెడ్డైన ప్రముఖ వ్యాపారవేత్తలు మంగంపేటలో వ్యాపార రీత్యా ముగ్గురాయి ఉత్పత్తిని చేయడం జరుగుతుంది. అలాంటి సమయంలో 18వ ఏటనే వచ్చిన జింపెక్స్ అధినేత అన్ని రకాల పలుకుబడులు, వ్యాపార రీత్యా అత్యంత అనుభవం కలిగిన త్రిమూర్తులు లాంటి ఆ ముగ్గురిలో చిన్న పిల్లాడిగా గోయింకా వారి చెంతన చేరి వారి మన్ననలను పొందుతూ వ్యాపార మెలకువలు తెలుసుకొని అత్యంత వ్యాపారవేత్తగా, మంచి గుణశీలిగా పేరుపొంది వారితోపాటు వ్యాపారాన్ని లాభనష్టాలు పంచుకుంటూ కొనసాగించారు. వారికి శిష్యుడిగా మెలిగిన గోయింకానే వారికి సలహాలు ఇచ్చే సలహాదారుడిగా ఎదిగారు. మంగంపేట ముగ్గురాయిని ప్రపంచ స్థాయిలో భారతదేశానికి చాటి చెప్పిన ఘనత ప్రముఖ పారిశ్రామిక వేత్త కూడా జింపెక్స్ సంస్థనని తెలిపారు. ఎన్నడూ కొనుగోలుకు నోచుకోని సిఎండి ముగ్గురాయిని అప్పట్లోనే ఓడలు, షిప్పులు ద్వారా రవాణా చేసి భారతదేశం యొక్క పేరును ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన ఘనత కూడా జింపెక్స్ సంస్థదే అన్నారు. ఆర్ ఎస్ గోయింకా అందరిలో లేకపోయినా ఆయన ఆత్మ కోడూరు ప్రాంతాలలోనే ఉందని, ఈయన చేసిన సేవలు అత్యంత గొప్పవని మరువురానివని కూడా తెలిపారు. నందలూరు సాయిబాబా గుడికి సుమారు కోటి రూపాయల పైన ఖర్చు చేసి వెండి సింహాసనాన్ని సుమారు 44 కేజీలతో చేయించి, గుడి గోపురం పైన అత్యంత ఖర్చుతో కూడిన విలువైన కలశాన్ని కూడా ఆయన తన ద్వారా పెట్టించడం మా తల్లిదండ్రులు చేసుకున్న సుకృతఫలమేనని, నేను నేడు ఈ స్థాయిలో ఉన్నాను అంటే ఒక విధంగా వ్యాపార రీత్యా గురువుగాను మరో విధంగా నాకు తండ్రిగాను నన్ను ఏమి తెలియని వయసు నుంచి ఆదరించి అక్కున చేర్చుకుని ఈ స్థాయికి తెచ్చిన ఘనత ఆర్ఎస్ గోయింకాదేనని విశ్వేశ్వరరావు కంటతడి పెట్టుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయుడు మాట్లాడుతూ ఎంతోమంది మంగంపేటలో వ్యాపారాలు చేసి సక్రమంగాను, అక్రమంగాను సంపాదించుకుని వెళ్లిపోయారే గాని ప్రజలకు ఉపయోగపడిన సందర్భాలు ఎంతో తక్కువనే చెప్పవచ్చు. నేడు ఈ కోడూరు నియోజకవర్గానికే కాకుండా రాజంపేట, కడప, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు కూడా ఆయన ఎన్నో బడులు గుడులు బస్ షెల్టర్లు మౌలిక సదుపాయాలు కల్పించి గొప్ప పేరు తెచ్చుకున్న వ్యాపారవేత్త జింపెక్స్ అధినేత గోయింకానేనని కొనియాడారు. అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ ఆయనతో ఉన్న సత్సంబంధాలు తనకు చాలా తక్కువని అయినప్పటికీ ఆయన చేసిన సేవా కార్యక్రమాలు కోడూరు శివాలయానికి గోపురాలు నిర్మించడం, దక్షి ణామూర్తి ఆలయాన్ని కట్టడం, కోడూరు ప్రాంతంలో మొట్టమొదటిగా బస్సు షెల్టర్ నిర్మించడం అనేకమంది పేదలకు సహాయ సహకారాలు అందించడం, ఎంతోమంది చిన్నచిన్న వ్యాపారులకు అండగా నిలిచి ఆర్థిక సాయం చేసి వారిని అభివృద్ధి చేసిన దాఖలాలు ఉన్నాయి. తాను చూసి విన్నానని కూడా ఆయన తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి మాట్లాడుతూ మన ప్రాంతంలో ఇలాంటి గొప్ప పారిశ్రామిక అధినేతలు ఉండడం ఎంతో గొప్పతనం అన్నారు. ఇలాంటి వారి ద్వారా ఎందరో పేదలు చిన్న పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందారని నేడు ఆయన లేని లోటు వారి కుటుంబ సభ్యుల ద్వారానో, అత్యంత ప్రముఖుడైన విశ్వేశ్వరరావు ద్వారానో కోడూరు ప్రజలు తీర్చుకోవాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ జింపెక్స్ అధినేత ఆర్ఎస్ గోయింకా సుమారు అర్థ శతాబ్దానికి పైగానే ఇక్కడ వ్యాపార రీత్యా స్థిరపడ్డారన్నారు. ఆయనది తమిళనాడు అయినప్పటికీ ఆయన తెలుగువాడిగా కోడూరు ప్రాంత వాసిగా ఉన్నారన్నారు. ఆయన శక్తి మేర ప్రజలకు సంబంధించిన సమస్యను ఏ రకంగా నైనా తీర్చేందుకు ముందుండే వారన్నారు. మంగంపేట సిపిఓ గోపీనాథ్ మాట్లాడుతూ మంగంపేట బెరైటీస్ గనుల్లో తాను ప్రముఖ జియాలజిస్ట్ గా వచ్చినప్పటికీ జియాలజిస్ట్ దృష్టిలో కూడా గో యింకా సలహాలు తీసుకుని బెంచ్ ఫార్మేషన్ లుక్ అని ఓర్ ఓబి బద్దన్లు కానీ అడిగి తెలుసుకునే వారమన్నారు. అనంతరం జింపెక్స్ కంపెనీ డైరెక్టర్ వినోద్ చౌదరి మాట్లాడుతూ ఆయన పట్ల కులాలకు అతీతంగా, మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి వచ్చి ఆయన ఆత్మకు శాంతిని చేకూరే విధంగా సంస్మరణ సభకు హాజరైన వారందరినీ చూస్తుంటే మున్ముందు కూడా జింపెక్స్ సంస్థకు, అందులో పని చేసే మాకందరికీ పెద్దాయనకు చూపిన ఆదరభిమానాలే మాపట్ల కూడా చూపి మమ్మల్ని ఆదరించి మా ద్వారా సహాయ సహకారాలు పొందాలని కోరారు. అనంతరం గోయింకా కుమారుడైన కరణ్ గోయింకా మాట్లాడుతూ మా సంస్థ పట్ల, మా తండ్రిగారి పట్ల కోడూరు నియోజకవర్గ ప్రాంత ప్రజలు, నాయకులు, రాజకీయ పార్టీలు, వ్యాపారవేత్తలు చూపిన ఆధార అభిమానం మేము జన్మలో సంపాదించుకోలేమని, ఇంత స్థాయిలో మా తండ్రిగారైన ఆర్ఎస్ గోయింకా పొందిన ఆదరభిమానాలను ఎక్కడ చూడలేమని ఆయన తీవ్ర స్థాయిలో దిగ్భ్రాంతి చెంది దుక్కించారు. ఆయన దుఃఖం సభకు వచ్చిన అందరి మనసులను కలచివేసింది. ఈ కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, పంతగాని నరసింహా ప్రసాద్, అడ్వకేట్ రెడ్డయ్య, బిజెపి చంగల్ రాజు, సిపిఐఎం కార్యవర్గ సభ్యుడు సిహెచ్ చంద్రశేఖర్ తదితరులు జింపెక్స్ అధినేత గోయింకా చేసిన సేవలు కొనియాడారు.

## గురువులను సన్మానించిన టీపీఎం పూర్వ విద్యార్థులు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాత వార్త



తిరుపతిలోని టీపీఎం పాఠశాల 1969-70 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల నాయకులు అధ్యక్షుడు సురా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాల్యంలో టీపీఎం పాఠశాలలో విద్యాభ్యాసం చేశారని తెలిపారు. క్రమశిక్షణకు టీపీఎం పాఠశాల మారుపేరుగా నిలిచిందని, ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకోవడంతో పాటు పూర్వ విద్యార్థుల ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. సమాజంలో గురువులు మార్గదర్శకులని, తమ జీవితాలను తీర్చిదిద్దిన ప్రతి గురువుకు పూర్వ విద్యార్థులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని సురా సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి (మాజీ ఎంఈఓ), చిన్నరాం, ఎం. వెంకటరమణ, ఎల్. సుబ్రహ్మణ్యం, కే. శ్రీదేవి, ఎం. పశుపతి, డా. నారాయణ రెడ్డి, పి. గోరఖ్, ఎం. సుబ్బారెడ్డి, ఆంజనేయులు రెడ్డి, టి.ఏ.ఎస్. నారాయణ్, వై. ఆదిలక్ష్మి ్మ, శ్రీరామ్ రావు తదితర ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల నాయకులు గోపాల్ రెడ్డి, హేమలత, లలిత్, సాయి ప్రభ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆత్మీయంగా గడిపారు.

## గురువులే విద్యార్థుల భవిష్యత్‌కు దిశానిర్దేశకులు

తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాత వార్త



విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తితిదే ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినులు ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జ్ఞానాన్ని అందించి విద్యార్థుల జీవితాలకు సరైన దిశానిర్దేశం చేస్తారన్నారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, ఆలోచనా విధానం, నైతిక విలువలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, సమాజ భవిష్యత్‌ను నిర్మించే పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తికి విశిష్టతను తీసుకొచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఒక ఉపాధ్యాయుడు తన బోధన, వ్యక్తిత్వం ద్వారా ఎంతోమంది విద్యార్థుల జీవితాలపై ప్రభావం చూపగలరన్నారు. తరగతి గది విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక వికాసానికి వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థినులు తమ గురువుల నుంచి స్ఫూర్తి పొంది క్రమశిక్షణ, విలువలు, సేవాభావాన్ని అలవరచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురువు గొప్పతనం, ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అధ్యాపకులు నిర్వహించిన ఆటలు, పాటలు, వినోద కార్యక్రమాలు విద్యార్థినులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## ఉపాధ్యాయ దినోత్సవాన

### విశ్వవిద్యాలయ పరిశోధనా పురస్కారాలు

తిరుపతి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



ఉపాధ్యాయ దినోత్సవాన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ పరిశోధనా పురస్కారాలు - 2026ను శనివారం ప్రదానం చేశారు. మాజీ ఉపకులపతి ఆచార్య ఎస్. రత్నకుమారి, హోమ్ సైన్స్ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య ఎ. జ్యోతి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య పి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను ఏర్పాటు చేశారు. బెస్ట్ రీసెర్చ్ అవార్డు - 2026 సామాజిక శాస్త్రాల విభాగంలో న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత కనిపాకంకు, సైన్సెస్ విభాగంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ కె. స్వాతికి ప్రదానం చేశారు. ఇంటర్‌డిసిప్లినరీ/ట్రాన్స్‌డిసిప్లినరీ/ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ అవార్డు - 2026 సామాజిక శాస్త్రాల విభాగంలో కమ్యూనికేషన్ జర్నలిజం విభాగానికి చెందిన ఆచార్య టి. త్రిపుర సుందరికి సైన్సెస్ విభాగంలో ప్రొఫెసర్ కె. స్వాతికి లభించింది. అలాగే ఇన్నోవేటివ్ రీసెర్చ్ అవార్డు - 2026ను కూడా ప్రొఫెసర్ కె. స్వాతి అందుకున్నారు. టాలెంట్ రీసెర్చ్ అవార్డు ఫర్ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ - 2026ను ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) డాక్టర్ ఎన్. వరలక్ష్మి ్మకి, టాలెంట్ రీసెర్చ్ అవార్డు ఫర్ రీసెర్చ్ స్కాలర్ - 2026ను హోమ్ సైన్స్ విభాగం పరిశోధకురాలు ఎస్. భార్గవికి ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఒక ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితాన్ని సరైన దిశలో తీర్చిదిద్దడంలో, వారి భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా, వారి వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకులుగా నిలవాలని ఆమె పేర్కొన్నారు.

## గణనాథునికి ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి శుక్రవారం రాత్రి గ్రామోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. కాణిపాకం ఆలయం లో గోకులాష్టమి పండుగ పర్వదినం సంద ర్భంగా స్వామివారికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన ధనంజయ యాదవ్, దేవరాజులు యా దవ్, రేణుగోపాల్ యాదవ్, రాజేంద్ర యాదవ్‌లు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయంలో ఉదయం స్వామి వారం మూలవిరాట్‌కు ఉభయదారులచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే రాత్రి అర్చకస్వాములు సిద్ధి బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాదాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన మూషిక వాహనంపై స్వామి, అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ వయసు పెంపుపై సానుకూలత

తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త



విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని ఏపీ జేఏసీ చైర్మన్ ఏ. విద్యాసాగర్‌రావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానం మేరకు ప్రభుత్వంతో చర్చలకు వెళ్లే ముందు ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ప్రతినిధులు ఏపీ జేఏసీ చైర్మన్‌ను కలిసి ఈ అంశంపై విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పదవీ విరమణ వయసు పెంపు అంశాన్ని ఏపీ జేఏసీ ఆజెండాలో చేర్చి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం. తిమ్మన్న, సెక్రటరీ జనరల్ ఎన్. సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగిరి రమేష్, జాయింట్ సెక్రటరీదేపూరి గురుప్రసాద్ తదితరులు విద్యాసాగర్‌రావును కలిశారు. సాంకేతిక, పరిపాలనా అంశాలను పరిశీలించిన అనంతరం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. త్వరితగతినసానుకూలనిర్ణయంతీసుకుంటుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## గురువులే జీవితానికి మార్గదర్శకులు: డా. ఎన్. భీమన్న

తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త



తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలో మార్గనిర్దేశం చేస్తారని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. భీమన్న అన్నారు. కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. భీమన్న మాట్లాడుతూ భారత రెండో రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1888 సెప్టెంబరు 5న తిరుత్తణిలో జన్మించిన రాధాకృష్ణన్ అభ్యసించి, మద్రాసు, మైసూరు, కలకత్తా, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా సేవలందించారని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా కూడా పనిచేశారని గుర్తుచేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గురువును త్రిమూర్తులతో పోలుస్తూ గురుర్ బ్రహ్మ, గురుర్ విష్ణు, గురుదేవో మహేశ్వరః అని పేర్కొనడం ద్వారా గురువుకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగడంతో పాటు కళాశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కళాశాల సీనియర్ అధ్యాపకులు పి. వెంకటలక్ష్మి ్మ, కె. నాగపద్మ, వై. వెంకటరమణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డా. ఎస్. జయశ్రీ, డా. ఎ. విద్యుల్లత, డా. వై. సునీత, కె. సాయి కుమారి, డా. వి. కృష్ణవేణి, డా. ఉమాదేవి, డా. వై. శిరీష, డా. కె. వసుధ, డా. కె.శిరీష, డా. కె. సరిత డా.నళిని, డా.వై. జయశ్రీ, డా. కస్తూరి, డా. శోభ, డా. శ్రీలత, డా. లక్ష్మి ్మ సంధ్య, డా. ప్రవీణ, డా. లక్ష్మి ్మదేవి, డా. పద్మిని, డా. శ్రీనివాసులుతదితరఅధ్యాపకులు, విద్యార్థినులుపాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

### 8,10వ తరగతి విద్యార్థులకు అవకాశం, ఏప్రిల్ 10న ప్రవేశ పరీక్ష

తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త




జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027-28 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 30 వరకు అవకాశం ఉందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్ష 2027 ఏప్రిల్ 10న జరుగుతుందని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలో ప్రవేశానికి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 నవోదయ ప్రవేశ పరీక్షలో విశ్వం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని డా. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. విద్యార్థి కార్తీక్ శ్రీహాన్ రెడ్డి 100 మార్కులకు 98.75 మార్కులు సాధించి దేశవ్యాప్తంగా రెండో అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా 71 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వం, అధ్యయన సామగ్రి, నమూనా పరీక్షలు, నిరంతర పర్యవేక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 8688888802, 9399976999 నంబర్లను లేదా తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్, నవోదయ పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



తిరుమల, సెప్టెంబర్ 5 ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుం డా స్వామివారిని దర్శించుకుని, వాహన సేవలను ఆనందంగా తిలకిం చేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తు న్నట్లు టిటిడి సివిఎస్వ కెవి ముర శీకృష్ణ తెలిపారు. తిరుమల ఆలయ నాలుగు మాడ వీధులతోబాటు ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# తిరుపతి డివిజన్

## సీఎంని కలసిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలసి మెమోరాండం అందజేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని ఎమ్మెల్యే మర్యాద ‌పూర్వకంగా కలసి సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశా లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెప్షల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, అంజి స్వామి, రవిచంద్రన్, జమేధార్ కేశవులు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయానికి లక్ష విరాళం

చంద్రగిరి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:



స్థానిక పాతపేటలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయానికి ఎన్ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి శనివారం ఒక లక్ష రూపాయలు విరాళంగా మాజీ జడ్పీటిసి, ఆలయ ధర్మకర్త వీరం గారి రమేష్‌రెడ్డికి అందజేశారు. స్వామి వారికి తన మొక్కులు తీర్చమని వేడుకోగా నెరవేరిన నేపధ్యంలో ఆయన ఆలయానికి ఈ విరాళం అందజేశారు. కోరిన కోర్కెలు తీర్చే సాయినాధుడిపై భక్తిశ్రద్ధలతో దాత అందించిన ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి, అన్నదానం, ఆలయ జీర్ణోద్ధరణకు వినియోగిస్తామని ధర్మకర్త వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శివరామ శర్మ, సుబ్రమణ్యం రెడ్డి, జల్లా రవి, రెడ్డి రాజేంద్ర రెడ్డి, యారాశి రవిచంద్ర రెడ్డి, యారాశి శంకర్, గురునాధ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## జేబీఆర్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవాలు

నాగలాపురం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:




తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలోని ప్రముఖ విద్యాసంస్థ జేబీఆర్ విద్యాసంస్థల్లో శ్రీకృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవం సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను తెలియజేసే కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అంతేగాక చిన్నారుల చేత ఉట్టి కొట్టే ఆటలు కూడా ఆడించారు. శ్రీకృష్ణుని బాల్య లీలలు, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ట వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా భారత మాజీ రాష్ట్రపతి, ఉపాధ్యాయుడు డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హేమాద్రి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.భూలక్ష్మి, ఏవో అంకయ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య

పుత్తూరు, సెప్టెంబరు 5 ప్రభాతవార్త :

అనారోగ్య సమస్యలతో ఒక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం పట్టణంలో జరిగింది. మసీదు వీధిలో వుంటున్న మాబుని (33) ఒక ఇంజనీరింగ్ కాలేజీలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం తల్లితండ్రులు మృతి చెందారు. ఒక అక్క, ఒక అన్న వుండగా వారిరువురూ చెన్నైలో నివశిస్తున్నారు. దాంతో ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. చాలా సంవత్సరాలుగా ఆమె కడుపులో క్యాన్సర్ గడ్డలతో సతమతమవుతున్నారని, రెండు, మూడు సార్లు శస్త్రచికిత్స నిర్వహించినా సమస్య తగ్గలేదని బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు.

## గురువులకు సమాజంలో ప్రత్యేక గౌరవం

### యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి

నింద్ర, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:



గురువులకు సమాజంలో ప్రత్యేక గౌరవం వుందని నింద్ర మండలం యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేం ద్రంలో యంపిడిఓ కార్యాలయం లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వే పల్లి రాధాక్రిష్ణ జన్మదిన పురస్కరించుకొని ఉపాధ్యాయులు దినో త్సవం మండల విద్యాశాఖాధికారి1 వసుమతి అధ్యక్షతన జరిగింది. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలు ఉపాధ్యా యుల చేతుల మీద ఆధారపడి వుందని అన్నారు. యంపిడిఓ శివప్రసాధ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే మాటలను మాత్రమే పరిగణంలోకి తీసుకుంటారని, అందువలనే ఉపాధ్యాయులు చాలా జాగ్రత్తగా పిల్లలతో మాట్లాడాలని తెలిపారు. మండలంలోని ఉత్తమ ఉపాధ్యా యులు సుబ్రమణ్యం ఆచ్చారి, వెంకటేశులు, మోహనా, బాస్కర్‌రావు, శ్రీనివాసులు, జయంతి, పరందామయ్య, ధాక్షాయాణి, లను సన్మానించి వారికి అవార్డులు పంపిణి చేసారు. ఈకార్యక్రమంలో నవోదయ మాజీ డైరెక్టర్ గోపాలక్రిష్ణ, మండల విద్యాశాఖాధికారి2 శ్రీధర్‌రాజు, రిటైర్డు ఉపాధ్యాయులు నరసింహాలు, ఉపాధ్యాయులురుద్రమూర్తి తదిరులు పాల్గోన్నారు.

## ఎస్వీబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మకు సన్మానం



తిరుపతి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:

కర్ణాటక రాష్ట్ర ఉద్యోగుల యూనియన్ అసోసియేషన్ అధ్యర్వంలో ఎస్వీబీసీ చైర్మైన్ శ్రీధర్ వర్మని శనివారం సన్మానించారు. కర్ణాటక గెస్ట్ హౌస్ తరుపున అధ్యక్షుడు కిరణ్ రాయల్ సన్మా నం చేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎంప్లా యిస్ స్పెషల్ ఆఫీసర్ కోదండ రామ్, నాగరాజ్ , గిరి పాల్గొన్నారు

## యువత నొప్పులకు జండు బామ్ ప్రచారం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త

ఆధునిక జీవనశైలితో యువత ఎదుర్కొంటున్న తలనొప్పి, మెడనొప్పి, అలసట వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని జండు బామ్ కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. నొప్పిని జండుతో దూరం చేయండి అనే సందేశంతో జండుతో నొప్పిని దూరం చేయండి పేరుతో ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఎక్కువసేపు తెరలను చూడటం, సామాజిక మాధ్యమాలను నిరంతరం వీక్షి ంచడం వల్ల కలిగే అలసటతో పాటు రోజువారీ ఒత్తిడి, అతిగా ఆలోచించడం వంటి సమస్యలను ఈ ప్రచారంలో ప్రస్తావించింది. 16 నుంచి 28 ఏళ్ల యువతను ప్రధానంగా లక్ష ్యంగా చేసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఇమామి లిమిటెడ్‌కు చెందిన జండు బామ్ ఈ ప్రచారాన్ని దృశ్య మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా పలు రాష్ట్రాల్లో నిర్వహించనుంది. మారుతున్న తరానికి అనుగుణంగా జండు బామ్‌ను మరింత చేరువ చేయడమే ప్రచారం లక్ష ్యమని సంస్థ వెల్లడించింది.

